ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 10.10.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశ భవిష్యత్తు యువత సరికొత్త ఆవిష్కరణలపై ఆధారపడి ఉందని స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ గవర్నింగ్ బోర్డు మెంబర్ డాక్టర్ సనక్ మిశ్రా పేర్కొన్నారు. ఈరోజు వరంగల్ ఎన్ఐటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు.

2. హైదరాబాద్ బంజారాహిల్స్ లో 750 కోట్ల రూపాయల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి ఈరోజు హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలంగా బోర్డులను పెట్టారు.

3. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చడం కోసం బీజేపీ , కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నాలు చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచించారు.

4. హైదరాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి సహా రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో అక్కడక్కడా ఈరోజు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

**స్టాప్ ఎలక్షన్స్**

రాష్ట్ర ఎన్నికల సంఘం MPTC, ZPTC ఎన్నికలకు సంబంధించి..సెప్టెంబర్ 29న విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పాటు, ఎన్నికలకు అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కూడా నిలిపివేశారు. కోర్టు తుది తీర్పు ఆధారంగానే భవిష్యత్తులో ఎన్నికల తేదీలు ప్రకటించే అవకాశం ఉంది.

**పీటీసీ, హైదరాబాద్**

**ఎన్నికలు**

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నిలిచిపోయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మంత్రులు, అధికారులతో వివిధ అంశాలపై చర్చిస్తారు. హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు లో అప్పీల్ కు వెళ్లే అవకాశాలు , ఆర్టినెన్స్ ఆమోదిం ప చేసేందుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి చర్చించే అవకాశం ఉందంటున్నారు.

డెస్క్

**జూబ్లీ హిల్స్:**

వచ్చే నెల 11వ తేదీన జరగనున్న జూబ్లీ హిల్స్ శాసనసభ నియోజక వర్గ ఉప ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరున్నవారు 12 రకాల గుర్తింపు కార్డులను వినియోగించుకోవచ్చని హైదరాబాద్ ఎన్నికల అధికారి RV కర్ణన్ తెలియజేశారు. ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా , ఓటరు

జాబితాలో పేరున్న పక్షంలో 12 రకాల గుర్తింపు కార్డులో ఏదో ఒక ఫోటో గుర్తింపు కార్డు చూపించి తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

**---MSL**

**బీఆర్ఎస్ వినోద్**

బీసీల రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చడం కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నాలు చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ… రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం , బీజేపీ ఎంపీలు బీసీల రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయలేదని విమర్శించారు.

పీఎన్

**వరంగల్ నిట్**

దేశంలోని యువత భవిష్యత్తు, నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ పైన ఆధారపడి ఉందని స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ గవర్నింగ్ బోర్డు మెంబర్ డాక్టర్ సనక్ మిశ్రా పేర్కొన్నారు. ఈరోజు వరంగల్ ఎన్ఐటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలానుక్రమ జ్ఞానం అన్న అంశంపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సనక్ మిశ్రా ఆకాశవాణితో మాట్లాడుతూ…

**సౌండ్ బైట్: సనక్ మిశ్ర**

ఈ వేడుకల్లో వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.  .. తమ విద్యాసంస్థ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ అభివృద్ధికి వినియోగిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ సాధించిన విజయాలను  ఆయన ఆకాశవాణితో చెప్తూ...

**బైట్: బిద్యాధర్ సుబుధి**

పీటీసీ, వరంగల్

**హైదరాబాద్ హైడ్రా**

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో హైడ్రా అధికారులు ఈ ఉదయం కూల్చివేతలు చేపట్టారు. దాదాపు 750 కోట్ల రూపాయల  విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకున్నారు.  కోర్టులో వివాదం ఉన్నప్పటికీ , అక్రమంగా ఫెన్సింగ్ వేసి , షెడ్లు నిర్మించారని అధికారులు తెలిపారు. దీంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు ఈ ఆక్రమణలను తొలగించి , భూమి చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ వేశారు. అనంతరం ప్రభుత్వ స్థలంగా బోర్డులను పెట్టారు.

**పీటీసీ, హైదరాబాద్**

**ఆసిఫాబాద్ కేంద్ర బృందం**

ఆసిఫాబాద్ జిల్లాలోని సామాజిక ఆసుపత్రులలో వసతులపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా  బృందం హైదరాబాద్ నుంచి వచ్చి అధ్యయనం చేస్తోంది. ఈరోజు బెజ్జూర్ సామాజిక ఆసుపత్రిని పరిశీలించిన బ్రుందం సభ్యులు అక్కడి వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు

మాట్లాడుతూ... ఆసుపత్రిలో రోగులకు కల్పించే సౌకర్యాలతో పాటు , మందుల లభ్యత, లాబరేటరీ, ప్రసూతి గది, డేటా ఎంట్రీ, ఓపి పరిస్థితిపై పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని అన్నారు.

**పీటీసీ, ఆసిఫాబాద్**

**<u>బ్రేక్</u>**

**సేవా పక్వాడా**

సేవా పక్వాడాలో భాగంగా భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో సమాజానికి సేవలందించిన విశిష్ట వ్యక్తులు , పద్మ అవార్డు గ్రహీతలను నిన్న హైదరాబాద్ లో సన్మానించారు. వారు సాధించిన విజయాలు , అందించిన సేవలను గౌరవిస్తూ యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు చెప్పారు.

**పీఎస్**

**డీసీసీ**

రేపటి నుంచి జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల నియామకాల ప్రక్రియ ప్రారంభం అవుతుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఏఐసీసీ నియమించిన 22 మంది పరిశీలకులు జిల్లాల్లో పర్యటించి వారం రోజుల్లో సమగ్రమైన నివేదిక అందజేయనున్నారు.

**పీఎస్**

**సిరిసిల్ల పీఎం స్వనిధి**

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు అందిస్తున్న రుణాలు పొందేందుకు ఈనెల 15 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మెప్మా అధికారి మీర్జా అలీ బేగ్ తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ తో పాటు , వారి దుకాణం ఫోటో, పాసుపోర్టు సైజ్ ఫొటో, విద్యార్హత ధృవపత్రం, రేషన్, బ్యాంకు ఖాతాలను జత చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**పీటీసీ, సిరిసిల్ల**

**వాతావరణం**

రాష్ట్రంలో ఈరోజు ఉదయం అక్కడక్కడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మహబూబ్ నగర్ జిల్లాలో అత్యధికంగా 4 సెంటీ మీటర్లు, జోగులాంబ గద్వాల, వనపర్తి, నల్గొండ జిల్లాల్లో మూడు సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదయ్యిందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. హైదరాబాద్ , మహబూబ్ నగర్ , రంగారెడ్డి సహా రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో అక్కడక్కడా ఈరోజు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

**పీఎస్**

**కరీంనగర్ ఏసీబీ**

కరీంనగర్ జిల్లా , గంగాధర మండలం , మధురానగర్ లో ఇందిరమ్మ బిల్లు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు ఈరోజు అరెస్ట్ చేశారు. లబ్దిదారుడు శ్రీకాంత్ నుంచి పంచాయతీ

కార్యదర్శి మునిగాల అనిల్ 10 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

పీటీసీ, కరీంనగర్

**మహబూబాబాద్ షీ టీమ్**

మహిళలు, విద్యార్థినుల భద్రతే తమ లక్ష్యమని మహబూబాబాద్ జిల్లా షీ టీమ్ ఎస్ఐ సునంద అన్నారు. పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ రామనాథ్ కేకన్ ఆదేశాల మేరకు కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీం , భరోసా, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**పీటీసీ మహబూబాబాద్**

**యాదాద్రి యాక్సిడెంట్**

యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక శివారులో ఈ ఉదయం ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మంది విద్యార్థులతో సహా 11 మంది గాయపడ్డారు. సోమారం గ్రామానికి చెందిన విద్యార్థులు కొలనుపాక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్లేందుకు ఆటోలో ప్రయాణం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని కొలనుపాక, ఆలేరు ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**పీటీసీ యాదాద్రి**

**మానసిక ఆరోగ్య దినోత్సవం**

ఈరోజు ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 150 దేశాలకు పైగా సభ్యులున్న ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో మొదటిసారిగా 1992లో దీనిని జరుపుకున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం , ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సంరక్షణకు మద్దతుగా ప్రయత్నాలను సమీకరించడం ఈ దినోత్సవ లక్ష్యం. ఈ సందర్భంగా సోషల్ మీడియా పోస్ట్‌లో, ఆరోగ్య మంత్రి జె.పి. నడ్డా మాట్లాడుతూ ... ఈ దినోత్సవం ప్రజలు తమ భావోద్వేగ , మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తు చేస్తుందని అన్నారు.

**ఎస్ఎస్డీ**

**సిరిసిల్ల మానసిక ఆరోగ్యం**

మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ కోరారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సామూహిక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ ... సరైన నిద్ర , ఆరోగ్యకరమైన ఆహారం , వ్యాయామం, యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు.

పీటీసీ, సిరిసిల్ల

**ఆసిఫాబాద్ జడ్జి**

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాయమూర్తి.. విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**పీటీసీ ఆసిఫాబాద్**

**దూరదర్శన్:**

దూరదర్శన్ యాదగిరి కేంద్రం , ప్రాంతీయ వార్తా విభాగం కాంట్రాక్ట్ పద్ధతిపై వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. సీనియర్ కరస్పాండెంట్ , యాంకర్ కమ్ కరస్పాండెంట్ గ్రేడ్ 2 , యాంకర్ కమ్ కరస్పాండెంట్ గ్రేడ్ 3 పోస్టులతో పాటూ , బులిటెన్ ఎడిటర్ , వీడియో పోస్ట్ ప్రొడక్షన్ అసిస్టెంట్ , కంటెంట్ ఎగ్జిక్యూటివ్ , కాపీ ఎడిటర్, ప్యాకేజింగ్ అసిస్టెంట్, వీడియో గ్రాఫర్ పోస్టులను ప్రకటించింది. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

----MSL